డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

నిజాంపేట్: 18వ డివిజన్ సాయి హనురాగ్ కాలనీ కావ్య అవెన్యూ రోడ్డు నంబర్ 1లో డ్రైనేజీ సమస్యను ఆదివారం మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, కావ్య ఎవెన్యూ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జనరల్ రామకృష్ణ, విజయ్ కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన

నిజాంపేట్: ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 13న జరిగే దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుగొండ వెంకటస్వామి, తన్నీరు చిరంజీవి అన్నారు. న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో బాచుపల్లి డబుల్ బెడ్రూం సముదాయంలో ఆదివారం దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి డబుల్ బెడ్రూం బాచుపల్లి 1వ బ్లాక్ అధ్యక్షులు బాల బ్రహ్మచారి, 2వ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ రాజులు దివ్యాంగులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. బాచుపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఏ.నరసింహ, ప్రధాన కార్యదర్శిగా హెచ్.ఆనంద్, లాజర్, బి.సురేందర్, డి. రవి, బి.పాండు, బాచుపల్లి దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నిజాంపేట్ : ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లో శ్రీనివాస్ నగర్ పార్క్‌లో సిటీ న్యూరో సెంటర్ మియాపూర్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో సిటీ న్యూరో సెంటర్ వైద్యులు డాక్టర్ సాయి దినేష్, చక్రధర్‌రెడ్డి, ఆప్తోగుప్తా పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం!



కైసర్‌నగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- డ్రైనేజీ లేక ఇళ్ల మధ్య పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లో పారిశుద్ధ్య సమస్య పడకేసింది. స్థానికంగా 80 శాతం మేర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిత్యం మురుగునీరు ఇళ్ల మధ్య నుంచి ఏరులై పారుతుంది. దీంతో జన ఆవాసాల మధ్య మురుగు నిలిచిపోవడంతో ఎక్కడ చూసినా దుర్గంధం నెలకొంది. వర్షాకాలం, ఇళ్ల మధ్య మురుగు నిలవడం వల్ల దోమలతో జ్వరాల బారిన పడుతున్నారు. గుడిసెలతో ఏర్పడిన కైసర్ నగర్‌లో ప్రస్తుతం నూతన హంగులతో భవనాలు వెలిశాయి. కానీ ఏళ్లు గడుస్తున్న కనీస భూగర్భ డ్రైనేజీ మార్గానికి నోచుకోవడం లేదు. దీనికి తోడుగా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.



ఇళ్ల ముందు డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా పారతో కాల్వ చేస్తున్న స్థానికురాలు

డ్రైనేజీ లేకపోవడంతో..

డ్రైనేజీ మార్గం లేకపోవడంతో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత మాదిరిగా గుంతలు తీసి డ్రైనేజీని అందులోకి వదులుతున్నారు. గుంతలు నిండిపోవడంతో బస్తీలోని ప్రధాన రోడ్లలో డ్రైనేజీ నిత్యం ఏరులై పారుతుంది. దీనికి తోడుగా దోమలు వృద్ధి చెంది స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

కైసర్ నగర్ డ్రైనేజీ సమస్యపై ఇప్పటికే రెండుసార్లు పర్యటించి సర్వే నిర్వహించాం. మొత్తం డ్రైనేజీ నిర్మాణానికి రూ.75 లక్షలకు పైగా ఖర్చు వస్తుందని అంచనా వేశాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపా. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– రోహిణి, గాజులరామారం సెక్షన్ మేనేజర్

అధికారులు పట్టించుకోవాలి

బస్తీ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్న. గతంలో గుడిసెలు, రేకులతో ఉన్న ఇండ్లు ఇప్పుడు భవనాలుగా మారిపోయాయి. ఎక్కడలేని విధంగా మా బస్తీలో 40 ఫీట్ల రోడ్లు ఉన్నాయి. అయినా సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇళ్ల మధ్యనే మురుగునీరు నిలవడంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

– మహ్మద్ సత్తార్, స్థానికుడు

వర్షాకాలంలో పరిస్థితి ఘోరం

ప్రతిరోజు మురుగుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇక వర్షాకాలంలో మా పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఓ వైపు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, మరోవైపు వర్షపు నీటితో రోడ్లన్నీ మురికి కాలువలుగా మారుతాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయించాలి.

– ఖాజా, స్థానికుడు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సంకల్ప్ సే సిద్ధి కార్యక్రమంలో భాగంగా ఆదివారం జీడిమెట్ల గ్రామంలో ప్రకృతి ఎన్విరానిమెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై 500 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 వరకు కొనసాగే సంకల్ప్ సే సిద్ధి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు టీపీసీసీ లేబర్ సెల్ కృషి చేస్తుందని సంస్థ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొంపల్లిలోని తన కార్యాలయంలో టీపీసీసీ లేబర్‌సెల్ నియోజకవర్గ నియామకాలు చేపట్టారు. లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శిగా దువ్వూరి తేజశ్వర రావు, వైస్ ప్రెసిడెంట్లుగా చెవిటి శ్రీనివాస్, కంచగారు దుర్గయ్య, కొంపల్లి మున్సిపల్ ప్రెసిడెంట్‌గా దండు నరేంద్రరాజులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో కార్మిక విభాగాన్ని బలోపేతం చేసి, కార్మికులకు సామాజిక న్యాయం అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు కావలి గోపాల్, నాయకులు సప్పిడి భాస్కర్, మండల సంపత్ కుమార్, సాయిపేట మల్లేష్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న టీపీసీసీ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

సుభాష్‌నగర్: పేద, మధ్య తరగతి వారు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కైసర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదుల వేణు అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఆదివారం రామ్‌రాజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు రోగులకు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, సాజిద్ ఖయ్యూం, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

పంచామృతాభిషేకం

జగద్గిరిగుట్ట: ఆదివారం చింతల్, పద్మానగర్ ఫేజ్1 లోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకం నిర్వహించారు. భక్తులచే 108 కలశములతో తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

కుత్బుల్లాపూర్: సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ శ్రీకృష్ణనగర్‌లో తరచూ డ్రైనేజీ రోడ్ల పైకి వస్తుండటంతో ఆదివారం ఆయన స్థానికంగా పర్యటించి సమస్యను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవీందర్, సభ్యులు పురుషోత్తం, హనుమంత్, వీరారెడ్డి, నార్ల కంటి ప్రతాప్, చంద్రశేఖర్, సత్యనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న భరతసింహారెడ్డి



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కార్తీకవనం ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అయ్యప్ప కాలనీ రోడ్డు నంబర్ 4, 5, 6, 7, 8,9, 10, 11, 12, జాన్‌డీర్ ట్రాక్టర్ కంపెనీ, శ్రీదేవిబస్ బాడీ, ఇండియన్ పెట్రోల్ బంక్, ఫారెస్ట్ అకాడమీ, కార్తీకవనం, 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అశోక ఏలా మైసన్ ఫేజ్ 2, చైనా టౌన్, ముకేష్ టీ స్టాల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

చింతల్: ట్రీ కటింగ్, ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాగాటూల్స్ సబ్‌స్టేషన్ వసంత్ టూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలానగర్, ఐడీపీఎల్, పూజా ఇండస్ట్రీస్, అగ్రో ఇండియా ఇంజనీరింగ్, గిరినగర్ ఫీడర్ పరిధిలో రంగారెడ్డినగర్, సన్‌టెక్ ఇంజనీరింగ్, పంచశీల కాలనీ, నందా ఫుడ్స్, బీపీ ఇంజనీరింగ్, రెయిన్‌బో స్కూల్, సాయిలక్ష్మి ఇండస్ట్రీస్, ఎస్‌కే ఇంజనీరింగ్, ఎస్‌కేఎం టెక్నాలజీస్, టీసీ బాలానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సీఐఈ బాలానగర్ ఇండస్ట్రీఎల్ ఏరియా, మెగా పార్కింగ్, రోచెక్ ఫార్మాచ ఎంఎస్‌ఎంఈ, జీహెచ్‌ఎంసీ డబుల్‌బెడ్‌రూమ్, హెచ్‌ఎంటీ సబ్‌స్టేషన్ చింతల్ ఫీడర్ పరిధిలో హెచ్‌ఎంటీ కాలనీ, హెచ్‌ఎంటీ కంపెనీ ప్రాంతాల్లో సరఫరా ఉండని తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల పీఎంఐ పనుల నేపథ్యంలో సోమవారం సరఫరాలో అంతరాయాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, వనమా స్క్వేర్, డి-మార్ట్ వెనుక గల్లీ, హర్షా ఆస్పత్రి, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్ పార్క్, రామరాజునగర్, సుచిత్ర సిగ్నల్స్, మైఫ్రెండ్స్ సర్కిల్ ఏరియాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ టెస్ట్

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బుడాఖాన్ స్ట్రాంగ్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. మాస్టర్ బ్లాక్ బెల్ట్ థర్డ్ డాన్ ఎల్లేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. జైగౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశంగౌడ్ విద్యార్థులకు గ్రీన్ బెల్టు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్‌లు మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో పోలీస్ అధికారులు

సుభాష్‌నగర్: శత్రువు నుంచి మనం కాపాడుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ తైక్వాండో ఉపయోగపడుతుందని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ అన్నారు. కొంపల్లిలోని మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కలర్స్ బెల్ట్, సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 120 మందికి కలర్స్ బెల్ట్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, మేడ్చల్ మల్కాజిగిరి స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాహుల్, ట్రెజరర్ ఎల్. నరేష్, మెదక్ సీఐ మహేష్, ఎస్ఐలు మహేశ్వర్ రెడ్డి, నర్సింహులు గౌడ్, సుందరయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

చింతల్: బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చింతల్ డివిజన్ బీజేపీ ఆఫీస్ బేరర్లకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు బక్క శంకర్‌రెడ్డి, భానుచందర్, చెరుకుపల్లి భరతసింహారెడ్డి, సదానంద్, డివిజన్ ప్రెసిడెంట్ రాజేష్‌చారి, కేశవ్‌యాదవ్, పత్తి సతీష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి



ఘనంగా దుర్గమ్మ జాతర



జాతరలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ

దుండిగల్: దుండిగల్ గ్రామంలోని శ్రీమహాగణపతి సప్తమాతృక సహిత ఆలయంలో ఆదివారం దుర్గమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ని అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాల సమర్పించి అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. కార్యక్రమంలో బొంగునూరి కిశోర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చినంగి వెంకటేష్, జక్కుల మల్లేష్‌యాదవ్, ముత్యం రెడ్డి, ఆకుల ప్రేమ్, గోపాల్ రెడ్డి, కావాలి గణేష్, పండుగ శ్రీశైలం, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ జాతరలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

ఆక్రమణల జోరు !

పట్టించుకోని పుర యంత్రాంగం

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలో పార్కుల కబ్జా

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతోంది. ఎటు చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా 3–4 అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. కనీసం అగ్నిమాపక యంత్రాలు తిరిగేలా స్థలాలు ఉండాలనే విషయాన్ని ఆయా ఇళ్ల యజమానులు మర్చిపోతున్నారు. పైగా ఇంటికి ఆనుకుని కొత్త భవన నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనతో...

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)దరఖాస్తుల విచారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇరిగేషన్ ,రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ శాఖలు క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇష్టానుసారంగా వెలుస్తున్న అక్రమ కట్టడాలు, లేఅవుట్లతో పాటు రోడ్లు, పార్కులను కబ్జా చేసి నిర్మిస్తున్న భవనాలు, బహుళ అంతస్తులు, ఇండిపెండెంట్ ఇళ్లు వెలుగులోకి వస్తున్నాయి. పనుల ఒత్తిడి, పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించకపోవడంతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

భారీగా వసూళ్లు...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 16 పురపాలక సంఘాల పరిధిలో వెంచర్లు, లేఅవుట్లు, ఇండిపెండెట్ ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మిస్తున్న వారి నుంచి అడ్డగోలుగా పలువురు పెద్దలు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

◆ శామీర్‌పేట, ఎంసీపల్లి మండలాల పరిధిలోని లింగాపూర్ తండా, లక్ష్మాపూర్, మజీద్‌పూర్, దేవరయాంజల్, కోల్తూర్ తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్ అక్రమ వెంచర్లు వెలిసినా.. పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. బోడుప్పల్, పీర్జాదిగూడ, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ పురపాలక సంఘాల పరిధిలోని పలు కాలనీల్లో ప్రతిరోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పురపాలికల్లో ఇటీవల విలీనమైన పంచాయతీలతో పాటు ప్రస్తుత జీపీల్లో కూడా అక్రమ కట్టడాలు, లే అవుట్లు కొనసాగుతున్నాయి. బొమ్మరాసిపేట మూడుచింతలపల్లి, తుర్కపల్లి, బాబాగూడ, అంకిరెడ్డిపల్లి, బోగారం, కీసర, చీర్యాల, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, యాద్గార్పల్లి, అలియాబాద్, లింగాపూర్ తండా, చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం, నూతనకల్లు, రాయిల్పూర్, సైదోనిగడ్డ తండాలలో పెద్దఎత్తున అక్రమ కట్టడాలు, లేఅవుట్లు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.



పోచారంలో చేపట్టిన భవన నిర్మాణాలు

సర్కిళ్ల పరిధిలో..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిళ్ల పరిధిలో పార్కులు, రోడ్లు ఆక్రమించి అక్రమ కట్టడాలు వెలిసినట్లు గుర్తించారు. జిల్లాలోని ఉప్పల్ సర్కిల్‌లో 1989 చదరపు గజాల స్థలం, కాప్రా సర్కిల్‌లో 194 చదరపు గజాల స్థలం, మల్కాజిగిరి సర్కిల్‌లో 36 చదరపు గజాలు, మూసాపేట్‌లో 20, కూకట్‌పల్లిలో 455, కుత్బుల్లాపూర్‌లో 62, గాజులరామారంలో 198 , అల్వాల్ సర్కిల్‌లో 155 చదరపు గజాల స్థలం ఆక్రమణకు గురయ్యాయి. ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న నిర్మాణాలపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉన్నా.. అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029